కథ

# కోణార్కలో కదిలిన శిల్పం

తప్పులో, ఒప్పులో- ప్రతివ్యక్తి జీవితంలోనూ కొన్ని మర్చిపోలేని సంఘటనలు జరుగుతాయి. వాటికి కారణం వుండదు. నైతిక విలువల నిమిత్తం వుండదు. అవి అలా జరిగిపోతాయంతే! అవి వెదజల్లే జ్ఞాపకాల సౌరభాలు మాత్రం జీవిత పర్యంతం వెంటాడుతూనే వుంటాయి. ఈ వాస్తవాన్ని అద్భుతమైన కథనశిల్పంతో రూపు గట్టించిన కథ ఇది!



***"సర్! మరో విషయం... ఇక్కడ ఓ ప్రాజెక్ట్ ఆఫీసర్ మిమ్మల్ని కలవాలనుకుంటున్నారు. వారు మీ 'ఫాన్'!" రిజిష్టర్లో సంతకం పెడుతూండగా ఇంగ్లీషులో పొలైట్‌గా చెప్పాడు ఫ్రంట్ ఆఫీస్ మేనేజర్.***

***తలెత్తి ప్రశ్నార్థకంగా చూశాను.***

"రూం రిజర్వ్ చేసుకోడానికి మీరు హైదరాబాద్ నుంచి ఫోన్ చేసినప్పుడు- అనుకోకుండా వారిక్కడే రిసెప్షన్ దగ్గరే వున్నారు. ఆ రోజు వాళ్ళ డిపార్ట్‌మెంట్ సెమినార్ మా హోటల్లోనే జరిగింది. మీరు రాగానే చెప్పమని రిక్వెస్ట్ చేశారు... ఎప్పుడు రమ్మని చెప్పమంటారు సర్?" అదే పొలైట్‌నెస్‌తో అడిగాడు మేనేజర్.

నేను రాయబోతున్న కొత్త సీరియల్ కోసం 'స్టోరీబోర్డు' తయారుచేసుకోడానికి ఏకాంతంగా ఓ వారంపాటు ఎక్కడికైనా వెళ్ళాలనిపించింది. వెంటనే, ఎప్పట్నించో నేను చూడాలనుకుంటున్న భువనేశ్వర్, పూరీ, కోణార్కలు గుర్తొచ్చాయి. ఇంక వేరే ఆలోచించకుండా భువనేశ్వర్ బయల్దేరాను. వచ్చి ఇంకా అరగంట కూడా కాలేదు... అప్పుడే నా ఏకాంతానికి భంగం!

"వీలయితే రేపుదయం తొమ్మిదికి రమ్మనండి. ఇంతకీ... ఎవరతను? పేరేంటి?" మామూలుగా అడిగాను.

"అతను కాదు సర్... ఆమె! పేరు భాను" చెప్పాడు మేనేజర్

నాకు కొద్దిగా ఆశ్చర్యమనిపించింది. ఇంక ఆ విషయం గురించి ఏమీ మాట్లాడకుండా నా గదికెళ్ళాను.



చిమ్మరి మనోహర్

** ** **

మర్నాడు ఉదయం తొందరగా లేచి రెడీ అయిపోయాను. తొమ్మిది కావడానికి ఇంకా పదినిమిషాలుంది. అప్పుడే కాలింగ్ బెల్ మోగింది. తలుపు తీశాను.

ఒక్కసారిగా మెరుపు మెరిసినట్లైంది!

టెంపుల్ బోర్డర్ వున్న గ్రే కలర్ సిల్కు చీరలో, పెదాల మధ్య అణచిపెట్టిన చిరునవ్వుతో నా ఎదురుగా నిల్చుని వుందామె. పోచంపల్లి వస్త్రంతో ప్యాచ్‌వర్క్ చేసిన పెద్దకొంగు గుండ్రని ఆమె భుజం మీదుగా జారాడుతూ నేలని తాకుతోంది. వయసు ఇరవై ఎనిమిదీ- ముప్పై మధ్య వుండొచ్చు. పొట్టీ పొడవూ కాని ఎత్తులో, తెల్లటి ఛాయలో నిండుగా వుంది. కొంచెం కోలగా, కోమలంగా వున్న ఆమె ముఖానికి విల్లులా వొంగిన ఎర్రటి కింది పెదవి, కొనదేరిన సన్నని ముక్కు, తేనెరంగు కళ్ళు మరింత ఆకర్షణనిస్తున్నాయి.

బహుశా... 'ఆమే' అయ్యుంటుంది!

ఇంతలో-. అణచిపెట్టిన ఆమె పెదాలు విచ్చుకున్నాయి. "గుడ్ మాణింగ్ సర్... ఐయామ్ భాను" అంది చిరునవ్వుతో.

నేను తేరుకోక తప్పిందికాదు. విష్‌చేసి, ఆమెను లోపలికి ఆహ్వానించాను.

పరిచయాలయ్యాయి. వాళ్ళది విజయనగరం. వుద్యోగరీత్యా భువనేశ్వర్లో వుంటోంది. యూపీయస్సీ రిక్రూట్. పెద్ద ఉద్యోగం. ఇంకా పెళ్ళయినట్టు కనిపించలేదు.

బోయ్‌ని పిల్చి టీ తెప్పించాను.

"నేను మిమ్మల్ని ఇబ్బంది పెట్టడం లేదుకదా?" టీ సిప్ చేస్తూ అడిగింది భాను. పలికింది పెదాలే అయినా, ప్రశ్నించింది మాత్రం ఆమె కళ్ళు!

"ఏంలేదు" అన్నాన్నేను కొంచెం మొహమాటంగా.

"నాదో కోరిక... మన్నిస్తారా?"

ఏమిటన్నట్టు చూశాను.

"ఇక్కడ మీరు చూడాలనుకునే ప్రదేశాలన్నిటినీ మీ వెంట వుండి, మీకు చూపించే అవకాశం నాకివ్వండి..."

ఇదేం కోరిక?

'సారీ' అనబోయాను. ఇంతలో మళ్ళీ ఆమె పెదాలు విచ్చుకున్నాయి.

"నేను మీ రచనలన్నీ చదివాను. మీరు ఎన్నుకునే సబ్జెక్టులు, మీ భావాలు, మీ శైలి, మీరు రాసే ప్రతి వాక్యం, ప్రతి అక్షరం నాకెంతో ఇష్టం! నేను మీ అభిమానిని. అలాగని- మీ పక్కన నిలబడి ఫోటో తీసుకుని, ఆటోగ్రాఫ్ బుక్‌లో మీ సంతకం చేయించుకోవడంతోనే సంబర పడిపోయేంత ఎడాలిసెంట్‌ని మాత్రం కాను! ఈ మూడు నాలుగు రోజులూ... మీవెంట వుండటంవల్ల- మీతో ఎక్కువగా మాట్లాడే అవకాశం, మీ మాటల్ని ఎక్కువగా వినే అవకాశమూ నాకు దొరుకుతాయి. పనిలోపని... మీకో మంచి 'గైడ్'గా కూడా పనికొస్తాను!"

*భాను ట్రాన్సాక్షనల్ ఎనాలిసిస్‌కు నేను ఆశ్చర్యపోయాను. నేను సృష్టించిన పాత్రే నాతో మాట్లాడుతున్నట్టనిపించింది! ఆమె కోరిక కాదనడానికి నాకే కారణమూ కనిపించలేదు.*

ఆ తర్వాత అరగంటలో మేం కూర్చున్న టూరిస్టు కారు సైట్ సీయింగ్ కోసం హైవే ఎక్కింది.

** ** **

ఆ పూట సాయంత్రం ఆరుదాకా భువనేశ్వర్లో వున్న వందలాది దేవాలయాల్లో ముఖ్యమైన వాటిని నాకు చూపించింది భాను. వాటికి సంబంధించి తనకు తెలిసిన ప్రతి చిన్న సమాచారాన్నీ చాలా వోపిగ్గా చెప్పింది.

సైట్ సీయింగ్ నుంచి వచ్చాక- రాత్రి తొమ్మిదయ్యేవరకూ హోటల్ కిందున్న రెస్టారెంట్‌లో నాతోపాటే మాట్లాడుతూ కూర్చుంది భాను. మా సంభాషణల్లో ఉప్పల లక్ష్మణరావు నుంచి అరుంధతి రాయ్ దాకా- పవుస్తోవ్‌స్కీ నుంచి జెఫ్రీ ఆర్చర్ దాకా ఎందరో రచయితలు వచ్చారు. పెంగ్విన్ నుంచి హార్పర్ కాలిన్స్ దాకా- బుకర్ ప్రైజ్ నుంచి బ్రిటిష్ కౌన్సిల్ దాకా మరెన్నో విషయాలు దొర్లాయి.

భాను వెళ్ళిపోయాక, రాత్రి పన్నెండు దాటేవరకూ నా స్టోరీబోర్డు గురించి ఆలోచించాను. తర్వాత వెంటనే నిద్రపట్టలేదు. నా ఆలోచనల్లోకి భాను వచ్చింది.

పెదాల మీద చెరగని చిరునవ్వు, అణువణువూ తొణికిసలాడే ఆత్మవిశ్వాసం, ప్రవర్తనలో హుందాతనం, తను మాట్లా

డాలనుకున్నది సూటిగా మాట్లాడగలగటం- ఇవీ భానులో నేను గుర్తించిన ప్రత్యేక ఆకర్షణలు! నన్ను బాగా ప్రభావితుణ్ణి చేసిన ఈ ఆకర్షణల మత్తులో పడిపోయి, ఆమె భౌతిక అందాల్ని నేనసలు పట్టించుకోనేలేదు.

** ** **

మర్నాడు ధవళగిరి వెళ్ళాము.

బాతిక్ ప్రింట్ చేసిన ఎర్రని సల్వార్ సూట్‌పైన అదేరంగు దుపట్టా వేసుకు వచ్చింది భాను. వైట్‌పగోటా గురించి వివరిస్తూ, నాకంటే ఒక అడుగు ముందు నడుస్తోంది. "క్రీస్తుపూర్వం మూడో శతాబ్దంలో ఇక్కడే కళింగ యుద్ధం జరిగింది..." కొండ చుట్టూ వున్న విశాలమైన ప్రదేశాన్ని చూపిస్తూ నా వైపు తిరిగింది భాను. గాలికి ఆమె వక్షం మీదున్న దుపట్టా పైకిలేచి మెడదగ్గర చుట్ట చుట్టుకుని ఆగిపోయింది.

నేను తనవైపే చూస్తూండటం చూసి- "శారీ అయితే మరింత ఇబ్బందిగా వుండేది..." అంటూ చిన్నగా నవ్వింది భాను. తర్వాత పక్కకు తిరిగి, దుపట్టా రెండు చివర్లనీ గాలికి ఎగిరిపోకుండా కలిపి ముడేస్తూ ఫ్రీగా వొదిలేసింది.

ఉదయగిరి, ఖండగిరులను ఎక్కినప్పుడు కూడా ఇదే పరిస్థితి. అక్కడ జైనుల గుహలకన్నా, ఖారవేలుని కాలంనాటి శిల్పాలు- శాసనాలకన్నా భాను శరీర శిల్పమే నన్ను బాగా ఆకట్టుకొంది.

** ** **

తర్వాతరోజు 'పూరీ' వెళ్ళాము.

"చతుర్థామాల్లో పూరీ ఒకటి. ఇది తూర్పు దిక్కునుంది. సుమారు పన్నెండు వందల ఏళ్ళక్రితం గంగవంశానికి చెందిన రెండో మహాశివగుప్త యయాతి దీన్ని కట్టించాడు..." చెప్పటం ప్రారంభించింది భాను.

ప్రొఫెషనల్ గైడ్ కూడా ఇంత బాగా అన్ని విషయాల్ని చెప్పకపోవచ్చుననిపించింది నాకు. గైడ్‌ల దాకా ఎందుకు- ఎంతమందికి వాళ్ళవాళ్ళ ఊళ్ళలోనే వున్న గుళ్ళూ గోపురాల గురించి, చారిత్రక స్థలాల గురించి తెలుసుకునే ఆసక్తి వుంటుంది?

జగన్నాథుని దర్శనం తర్వాత ఆలయ సముదాయంలో నెమ్మదిగా నడుస్తున్నాము. నడుస్తున్న నా పాదాలు ఒకచోట ఆగిపోయాయి. ఎదురుగావున్న గుడి గోపురం చుట్టూ స్త్రీపురుషుల రతి భంగిమలను తెలిపే నిలువెత్తు నగ్న శిల్పాలు పంచరంగుల్లో వున్నాయి! నా పక్కనే భాను వుండటం మొదటిసారిగా నాకు ఇబ్బందిగా అనిపించింది. ముందుకు కదలడమా, లేక చుట్టూ తిరిగి అన్ని శిల్పాలనూ చూడటమా అన్నది తేల్చుకోలేక ఒక్కక్షణం అలాగే ఆగాను.

ఇంతలో- "గురూజీ! మీకు పెళ్ళయిందనుకుంటాను...?" పక్కనుంచి అడిగింది భాను.

"ఏం?" ఆమె ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా అడిగాన్నేను.

"ఈ శిల్పాల్లో సహజత్వముందంటారా?" అడిగింది భాను.

నేను షాక్ తిన్నట్టుగా భానువైపు తిరిగాను. ఆమె ముఖంలో మరేవిధమైన భావం లేదు. అదే చిరునవ్వు, అవే మెరిసే కళ్ళు! ఏం చెప్పాలో తోచక, చిన్నగా నవ్వాను.

తిరుగు ప్రయాణంలో డ్రైవర్ ఒక 'మోటెల్' దగ్గర కారాపాడు. బ్లాక్ కాఫీ ఆర్డర్ చేసి కూర్చున్నాము. అప్పటికే చీకట్లు కమ్ముకుంటున్నాయి.

చల్లటి సముద్రపు గాలి హాయిగా వొంటిని తాకుతోంది.

"గురూజీ! మీకిది తెలుసా..." ఏదో చెప్పబోయి ఆగింది భాను.

'గురూ' శబ్దాన్ని పాపులర్ చేసినందుకు మనసులో పింగళి నాగేంద్రరావుగారి మీద కోపం తెచ్చుకున్నాను. మా ఇద్దరి మధ్య నాలుగయిదేళ్ళకి మించి తేడా వుండదు. నన్ను పేరుపెట్టి పిలవొచ్చునని మేం కల్సుకున్నరోజే చెప్పాను. భాను ఒప్పుకోలేదు. 'గురూజీ' అంటానంది.

సరేననక తప్పలేదు నాకు.

"ఓ టర్కిష్ సామెతుంది...కాఫీ అంటే నరకంకన్నా నల్లగా, చావుకన్నా స్ట్రాంగ్‌గా, ప్రేమకన్నా తీయగా వుండాలిట!" కాఫీ సిప్ చేస్తూ అంది భాను.

మళ్ళీ తనే అంది- "గురూజీ! నాకు తెలీకడుగుతాను... అసలు ప్రేమంటే ఏమిటి? మనవాళ్ళ సినిమాల్లో, కథల్లో వున్నట్టు ఇద్దరు పెళ్ళికాని యువతీ యువకుల మధ్య, లేదంటే భార్యాభర్తల మధ్య వుండేదేనా?... మీ రచనలంటే నాకిష్టం... మరి మీ మీద నాకు ప్రేమ వుండకూడదా? ప్రేమ ఒక్కరికే పరిమితం కావాలా? అసలు... జీవితంలో ఏ వ్యక్తయినా ఒకరికన్నా ఎక్కువమందిని ప్రేమించకుండా వుండటం సాధ్యమేనంటారా? అలా వున్నామని అనుకోవటం హిపోక్రసీ కాదా?"

భాను కురిపించిన ప్రశ్నల వర్షానికి నాకెటువంటి ఆశ్చర్యమూ కలగలేదు. ఆమె మాట్లాడే ప్రతి మాటలోనూ ఎంతో మెచ్యూరిటీ, లాజిక్ కన్పించాయి నాకు.

ఆరోజు రాత్రి స్టోరీ బోర్డు రాసుకుంటుంటే మళ్ళీ నా ఆలోచనల్లోకి ప్రవేశించింది భాను. ఆ తర్వాత నేను నిద్రపోయే వరకూ నా ఆలోచనల్ని వదిలిపోలేదు...

** ** **

ఆ తర్వాతిరోజు వుదయం అనుకున్న సమయానికి బయల్దేరి కోణార్క్ చేరుకున్నాం.

సూర్య దేవాలయ ప్రాంగణంలో అడుగుపెట్టగానే ఏదో అద్భుతం చూస్తున్న అనుభూతి కలిగింది నాకు. "పదమూడో శతాబ్దంలో నర్సింహదేవుడు కట్టిన ఈ ఆలయ శిల్పం అమోఘం! ఇంత పెద్ద ఆలయాన్ని ఇసుక నేలలో కట్టడమనేది పరిశోధకులకు కూడా ఇంతవరకూ అంతుపట్టని నిజం..." భానులోని 'గైడ్' చెప్తోంది.

శిథిలం కాగా మిగిలిన ఆలయ భాగాల్ని ఒక్కొక్కటే చూడసాగాము.

"ఈ శిల్పాల భంగిమలన్నీ ఒడిస్సీ నృత్య భంగిమలు. హస్తముద్రల్లోనూ, పదవిన్యాసాల్లోనూ భరతనాట్యం, కూచిపూడి నృత్యాల సామ్యం ఒడిస్సీలో కొంతవరకు కనిపిస్తుంది..." ఓ శిల్పం దగ్గర ఆగి వివరించసాగింది భాను.

"శాస్త్రీయ నృత్యాల్ని చూసి ఆనందించగలనుకాని- వాటి మధ్యవున్న తేడాలు, సామ్యాల గురించి నాకేమీ తెలీదు" చెప్పాన్నేను.

ఒకసారి చుట్టూ చూసింది భాను.

**ఒకసారి చుట్టూ చూసింది భాను. మాకు దరిదాపుల్లో టూరిస్టులెవరూ లేరు. నేలని తాకుతున్న కొంగును తన నడుము చుట్టూ తిప్పి లోపలికి దోపుకుంది. చూస్తుండగానే, నెమ్మదిగా నా ముందుకు వచ్చి- శిల్పంలో వున్న నాట్య భంగిమను అలాగే పెట్టి చూపించింది భాను. తర్వాత అదే భావాన్ని భరతనాట్యంలోనూ, కూచిపూడిలోనూ చూపిస్తూ తేడాని వివరించింది.**

మాకు దరిదాపుల్లో టూరిస్టులెవరూ లేరు. నేలని తాకుతున్న కొంగును తన నడుము చుట్టూ తిప్పి లోపలికి దోపుకుంది.

చూస్తుండగానే, నెమ్మదిగా నా ముందుకు వచ్చి- శిల్పంలో వున్న నాట్య భంగిమను అలాగే పెట్టి చూపించింది భాను. తర్వాత అదే భావాన్ని భరతనాట్యంలోనూ, కూచిపూడిలోనూ చూపిస్తూ తేడాని వివరించింది. అలా వెంటవెంట మరికొన్ని భంగిమలు కూడా ప్రదర్శించి చూపించింది. చకచకా భంగిమలు మారుస్తూ అలా కదులుతున్న భానును చూస్తోంటే, కోణార్క్ శిల్పాలే ప్రాణం పోసుకుని నాముందు కదలి ఆడుతున్నట్లుగా అనిపించింది!

దిగ్భ్రమతో మైమరచిపోయి నాకు తెలీకుండానే చప్పట్లు కొట్టాను.

అక్కణ్ణించి ముందుకు కదిలాము. శిథిలమైన శిల్పాల్లో అక్కడక్కడా నగ్నంగా వున్న శిల్పాలు, రతికేళీ భంగిమల్లో వున్న 'ఎరోటిక్' శిల్పాలు కూడా చాలా కనిపించాయి.

***"...జయదేవుని అష్టపదుల్లోని శ్రీకృష్ణుని రతికేళీ శృంగారమే ఒడిస్సీ నృత్యంలోనూ, ఈ శిల్పాల్లోనూ కనిపిస్తుంది" మా ఎదురుగావున్న ఒక ఎరోటిక్ శిల్పం వైపు తదేకంగా చూస్తూ అంది భాను. ఈసారి నేనెటువంటి ఇబ్బందినీ ఫీలవ్వలేదు. భాను పక్కనే నడుస్తూ ప్రతి శిల్పాన్నీ పరిశీలనగా చూశాను.***

సాయంత్రం నాలుగవుతుండగా ఆలయం బయటికొచ్చాము. అక్కడేవున్న ఓ చిన్న గుడిసె హోటల్లో టిఫిన్ చేసి, కొబ్బరి బొండాలు తాగాము. తర్వాత నెమ్మదిగా ఇసుకలో నడుస్తూ సముద్రాన్ని చేరుకున్నాం.

అలలు పాదాల్ని తాకగానే చిన్నపిల్లలా ఎగిరి గంతేసింది భాను. గబగబా చీర కుచ్చెళ్ళను లోపలికి చెక్కుకుంది. కొంగుని నడుముచుట్టూ తిప్పి పక్కన దోపుకుంది.

అలలకి కొంచెందూరంగా- భానునే చూస్తూ నిల్చున్నాన్నేను.

లేత పసుపురంగో, లేలేత బంగారువన్నో- స్పష్టంగా చెప్పలేని రంగులో మృదువుగా వున్నాయి భాను పాదాలు. పాదాల నుంచి మోకాళ్ళకు కొంచెం కిందివరకూ ఎటువంటి ఆచ్ఛాదన లేకుండా నున్నటి కాళ్ళు. వాటిపైన- కన్పించీ కన్పించనట్టు మెరుస్తూ, మాయమవుతూ సన్నని నూగారు వెంట్రుకలు. చీరకూ జాకెట్టుకూ మధ్య అచ్ఛాదన లేకుండా నున్నని వొంపైన నడుము. రెండు పిరమిడ్ల మధ్యలోంచి ఏటవాలుగా పారుతున్న నైలునది పాయలా భాను వక్షాలను విడదీస్తున్న



## సామాజిక సేవ నా లక్ష్యం: నందితా దాస్

దీపా మెహతా 'ఫైర్'సినిమాలో స్ట్రయికింగ్ ఫెర్‌ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న నందితా దాస్ చూడచక్కని అమ్మాయి. అందంతో పాటు ఆలోచించగలిగే 'బుర్ర'కూడా ఉన్న అమ్మాయి. పరిణతిచెందిన ఆలోచనాతీరుతో మాట్లాడే నందితను మామూలు ప్రశ్నలడిగినా గంభీరమైన సమాధానాలు వస్తాయి. చూడగానే భారతీయత ఉట్టిపడేటట్టు కనిపించే నందితలో సంప్రదాయవాది మనస్తత్వం ఉంది. ఆధునికత మేళవింపు ఉంది. దుస్తుల్లో చీరలే నాకు చాలా ఇష్టం అనే నందితాదాస్, నవ్వితే బుగ్గన సొట్టలు పడే పసికందులంటే ప్రాణం అంటుంది. ఆత్మీయులు, ప్రేమించే సన్నిహితులు మృత్యురూపంలో దూరమయిపోతే...ఎంత వేదన?! అందుకే నాకు మృత్యువంటే భయం అని చెబుతుంది. సినిమాలు జీవితంలో ఓ భాగమే కానీ పూర్తిజీవితం కాదన్నది నందిత అభిప్రాయం. మెడికల్ సోషల్ వర్క్‌లో మాస్టర్ డిగ్రీ చేసినా ఈ నటికి భవిష్యత్తులో మంచి సామాజికసేవకురాలు కావాలన్నది లక్ష్యం. క్లాసికల్ మ్యూజిక్‌ను ఎంజాయ్ చేసే నందితను దేవుడు ప్రత్యక్షమైతే ఏమని కోరుకుంటావమ్మాయ్ అంటే - "భూమ్మీద శాంతిని" అని గంభీరంగా చెబుతుంది.



3

నీలిరంగుకొంగు నడుము చుట్టూ తిరిగి, ఆ వొంపులో అదృశ్యమైపోతోంది...

మొదటిసారిగా భాను అందాలు నాలో సంచలనానికి తెరతీశాయి. నన్ను దగ్గరకు రమ్మంటూ పిల్చింది భాను. వెళ్ళాను.

"ఏం చూస్తున్నారు? నేనందంగా వున్నానా?" చిలిపిగా నా కళ్ళల్లోకి చూస్తూ అడిగింది భాను.

ఏం మాట్లాడను నేను?

"గురూజీ! అసలు అందమంటే ఏమిటి? రంగూ, రూపూ, ఈ కళ్ళు, ఈ నడుము, ఇదుగో... వీటన్నిటి ఎత్తుపల్లాలు, కొలతలు... ఇవేనా అందమంటే?" రెండు చేతుల్తో తన శరీరంలోని ఆయా భాగాలను అభినయపూర్వకంగా చూపిస్తూ అడిగింది భాను.

ఏం చెప్పను సమాధానం? తనకు తెలియక అడుగుతోందా?

"మనకిష్టమైంది ఏదైనా అందంగానే వుంటుంది కదూ గురూజీ?... ఆ లెక్కన మీరు చాలా అందంగా వున్నారు!" మళ్ళీ తనే అంది అల్లరిగా నవ్వుతూ.

భాను ప్రతి మాటా, ప్రతి కదలికా నాలో సంచలనాన్ని లేపుతున్నాయి.

అలల చివర్లు కాళ్ళను తాకుతుండగా ఇద్దరం సముద్రతీరం వెంట పక్కపక్కనే నడవసాగాం. కొంచెం దూరం నడిచాక, నా చేతివేళ్ళు- ఆమె చేతివేళ్ళు అతి సహజంగా అల్లుకుపోయాయి.

**ఎదురెదురుగా నిల్చున్న మా ఇద్దరి కళ్ళల్లోనూ పల్చని నీటితెర. అసంకల్పితంగా నా ఎడమ చేయి భాను భుజాన్ని చుట్టేసింది. భాను కళ్ళు కిందకి వాలిపోయాయి. ఆమె తల నా ఛాతీలోపలికి చొచ్చుకుపోయింది. భాను నడుమును చుట్టేసిన నా రెండో చేయి, మా ఇద్దర్నీ మరింత దగ్గరికి చేర్చింది.**

నవ్వుతూ, తుళ్ళుతూ, పరుగెత్తుతూ అలా ఎంతసేపు తీరంవెంబడి చక్కర్లు కొట్టామో గుర్తులేదు. వున్నట్టుండి మా ఇద్దరి మధ్య మౌనం ప్రవేశించింది. బహుశా, ఆ మౌనం... 'రేపట్నించి ఇంక మేం కలవం' అన్న నిజం గుర్తుకు వచ్చినందుకేనేమో!

చీకటి పడుతూండగా తిరిగి భువనేశ్వర్ బయల్దేరాము. హోటల్ చేరేవరకూ కార్లో కూడా ఇద్దరం ఏమీ మాట్లాడుకోలేకపోయాము. రెస్టారెంట్లో కూడా నిశ్శబ్దంగానే ఏదో తిన్నామనిపించి బయటపడ్డాం. తర్వాత రూంకెళ్ళాం. అక్కడా ఇదే పరిస్థితి!

ఇక లాభం లేదని నేనే ఏదయినా మాట్లాడాలనుకున్నాను.

*"నువ్వు అమితంగా ఇష్టపడే రచయితను అసలు కలుసుకోకు!" అని ఇంగ్లీషులో ఒక సామెతుంది అన్నాను నవ్వుతూ.*

*"అది మీలాంటి వాళ్ళను దృష్టిలో పెట్టుకుని చెప్పిన సామెత కాదు" వెంటనే సీరియస్‌గా అంది భాను.*

"సో వాట్... ఇట్స్ ఆల్ ఇన్ ది గేమ్!"

"కాని... ఈ 'గేమ్' ఇంత బాధపెడుతూ ముగుస్తుందనుకుంటే, అసలు నేను దీన్ని ఆరంభించేదాన్నే కాదు!" భాను గొంతులో సన్నని జీర.

గబుక్కున వెళ్ళిపోడానికి లేచి, మూసివున్న డోర్ దగ్గరికి నడిచింది భాను. ఆమె వెనుకే నేనూ లేచాను.

ఎదురెదురుగా నిల్చున్న మా ఇద్దరి కళ్ళల్లోనూ పల్చని నీటితెర. అసంకల్పితంగా నా ఎడమ చేయి భాను భుజాన్ని చుట్టేసింది. భాను కళ్ళు కిందకి వాలిపోయాయి. ఆమె తల నా ఛాతీలోపలికి చొచ్చుకుపోయింది. భాను నడుమును చుట్టేసిన నా రెండో చేయి, మా ఇద్దర్నీ మరింత దగ్గరికి చేర్చింది. అప్పటిదాకా మా ఇద్దరిమధ్య వున్న గాలికూడా ఊపిరాడక పక్కకు తప్పుకుంది. నెమ్మదిగా భాను చేతుల వెచ్చదనం నా వీపుని తాకింది.

ఇంక ఆ రాత్రంతా మాకు తెలిసి మేం నిద్రపోలేదు... ఎప్పుడు నిద్రపోయామో మాకు గుర్తులేదు.

** ** **

నేను లేచేటప్పటికి నాపక్కన భాను లేదు. వాల్‌క్లాక్ వైపు చూశాను. మధ్యాహ్నం రెండు దాటింది. దిండు పక్కనే నా స్టోరీ బోర్డు ప్యాడ్ తెరచి పెట్టివుంది. దాన్లో ఒకేఒక్క వాక్యం అందంగా రాసివుంది. చదివి నవ్వుకున్నాను.

పెళ్ళిపట్ల నాకున్న కొన్ని స్థిరమైన అభిప్రాయాలు, అనుమానాల కారణంగా నేనింకా పెళ్ళి చేసుకోలేదు. భానులాంటి అమ్మాయి నాకింతవరకూ ఎదురుపడకపోవడం కూడా నాకే తెలీని ఒక కారణం కావచ్చు! మొదటిసారిగా నా అభిప్రాయాలను, అనుమానాలను పక్కనపెట్టి నన్ను నేనే ప్రశ్నించుకున్నాను- 'నాలుగు రోజుల పరిచయంతో, నాలుగువందల మాటలతో నన్నెంతో ప్రభావితం చేసి, నా ప్రపంచాన్నే తల్లకిందులు చేసిన భాను నా జీవిత భాగస్వామి అయితే ఎలా వుంటుంది?'

మరో గంటన్నరలో నా ట్రైన్ బయల్దేరుతుంది. వెంటనే భాను నెంబర్ డయల్ చేశాను.

అవతల ఫోన్ ఇంకెవరో ఎత్తారు. నన్ను నేను పరిచయం చేసుకుని 'భానుతో మాట్లాడాలి' అన్నాను.

"మేడమ్ ఇప్పుడే ఎయిర్‌పోర్ట్‌కెళ్ళారు సర్! సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొని జైపూర్ నుంచి వస్తున్న ఆమె భర్తను రిసీవ్ చేసుకోడానికి..."

ఒకే ఒక్క క్షణం నా గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. "భానుకు... పెళ్ళయిందా?" నాకు తెలీకుండానే అడిగాను.

"మేడమ్‌కు రెండేళ్ళ పాప కూడా వుంది... మెసేజ్ ఏదయినా చెప్తారా సర్?"

"నో... థాంక్యూ..."

ఫోన్ పెట్టేసి, అలాగే బెడ్‌పైన వాలిపోయాను.

సందర్భం వచ్చినా- నేనింకా పెళ్ళి చేసుకోలేదన్న నిజాన్ని భానుకు చెప్పలేకపోయాను. తనకు పెళ్ళయిన నిజాన్ని చెప్పాల్సిన అవసరం భానుకూ రాలేదు. ఇందులో ఎవరూ ఎవర్నీ మోసం చేసింది లేదు.

తప్పులో, ఒప్పులో- ప్రతివ్యక్తి జీవితంలోనూ కొన్ని మర్చిపోలేని సంఘటనలు జరుగుతాయి. వాటికి కారణం వుండదు. నైతిక విలువల నిమిత్తం వుండదు. అవి అలా జరిగిపోతాయంతే! అవి వెదజల్లే జ్ఞాపకాల సౌరభాలు మాత్రం జీవిత పర్యంతం వెంటాడుతూనే వుంటాయి.

భానుతో నా పరిచయం కూడా అటువంటిదే. ఈ అనుభవం నాకు ఆనందాన్నిచ్చింది. విచారాన్నీ కలిగించింది. ఒక జీవన సౌందర్యాన్ని సాక్షాత్కరింపజేసింది...

మరో గంట తర్వాత నేను కూర్చున్న ట్రైన్ హైదరాబాద్ వైపు బయల్దేరింది. కొత్త సీరియల్ 'క్లయిమాక్స్' ఆలోచిస్తూ, స్టోరీ బోర్డు రాసుకున్న ప్యాడ్ తెరిచాను. భాను రాసిన అక్షరాలు అందులో అందంగా కనిపించాయి.

*"మీతో వున్న మధుర క్షణాల్ని ఎన్నటికీ మర్చిపోలేను...*

*– భాను"*

## పట్టుదలే విజయానికి దారి




కొంతమందికి జీవితం వడ్డించిన విస్తరి. కాని చాలా మంది కష్టాలకోర్చి, జీవిత కదనరంగంలో నిల్చి పోరాడి విజయం సాధించాల్సి వుంటుంది. ఈ కోవకు చెందినదే నా జీవితం. స్వయంకృషి, పట్టుదల, జిజ్ఞాస, సాటివారందించే ప్రోత్సాహం నాకు మూలధనం. బాధ్యతతో పెంచాల్సిన తండ్రి కీ.శే. నారాయణ మూర్తి నామమాత్రంగా మిగిలిపోయారు. మా అమ్మగారు కీ.శే. భ్రమరాంబ, గురువు కీ.శే. ధూళిపాల వేంకటేశ్వరరావు (నిడదవోలు), గంగరాజుగారు నా జీవితానికి మార్గదర్శకులయ్యారు. వారి ప్రోత్సాహం, సహాయ సహకారాలతో అనేక కష్టాలను ఓర్చుకుని జంగారెడ్డిగూడెం హైస్కూల్‌లో 1959 సంవత్సరంలో ఎస్.ఎస్.ఎల్.సి పాసయ్యాను. తర్వాత ఏం చేయాలో తోచలేదు.

మిత్రులు, సహృదయుల సలహా మేరకు మూడు నెలలు ఆలస్యంగా ఏలూరు సి.ఆర్.ఆర్ కాలేజీలో చేరి పి.యు.సి పాసయ్యాను. కాలేజీకి వెళ్ళడానికి రోజూ రానుపోను 10 కి.మీ. నడిచేవాడిని. తర్వాత ఆర్థిక స్థితి బాగాలేక, తగు ప్రోత్సాహం లేక తాత్కాలికంగా విద్యకు స్వస్తి చెప్పాను. సినిమాహాలులో బుకింగ్ క్లర్కుగా, టైపిస్టుగా, టింబర్‌డిపో సేల్స్‌మాన్‌గా, ఎపిఎస్ఇబిలో తాత్కాలిక పద్ధతిపై కొంతకాలం, ఆర్.టి.ఏ ఆఫీసులో మరికొంతకాలం ఇలా చిన్నచిన్న ఉద్యోగాలు చేసి పొట్టపోసుకుంటుండేవాడిని. అలాగే ఉండిపోతే జీవితంలో పైకి వచ్చేది ఎన్నడు అనుకొని కష్టపడి అంచెలంచెలుగా విద్యను కొనసాగించాను.

ప్రైవేటుగా యూనివర్సిటీ పరీక్షలకు హాజరవుతూ, ఆరు నుంచి పదో తరగతి పిల్లలకు ట్యూషన్లు చెపుతూ బి.ఏ (తెలుగు లిటరేచర్), టి.ఎస్.ఎల్.సి పాసయ్యాను. నా దశ తిరిగి ఏలూరులోని సెయింట్ జేవియర్ హైస్కూలులో 1970 సం.లో గ్రేడు ॥ తెలుగు పండిట్‌గా ఉద్యోగం వచ్చింది.

అప్పటి నుండి ఉద్యోగం చేస్తూ ఎం.ఏ., బి.ఇ.డి పూర్తిచేశాను. కొన్ని సంవత్సరాలలో పదవీ విరమణ చేయబోయే నేను ఉత్త ఉపాధ్యాయునిగా మిగలక ఉత్తమ ఉపాధ్యాయునిగా పలువురి ప్రశంసలు, ప్రశంసాపత్రాలు పొందాను. దైవానుగ్రహం వల్ల జ్యోతిష్యం, వేదాంతం, సంగీతం, కవనం, రచన, వాస్తు శాస్త్రం మొదలైన వాటిలో ప్రావీణ్యం సంపాదించగలిగాను. ఎన్ని కష్టాలు పడ్డా ఇప్పుడు ఏవిధమైన లోటూ లేకుండా జీవనం సాగుతోంది. అదే నాకు సంతృప్తి. కష్టానికి తగిన ఫలితం వుంటుందని అనుభవాలే నాకు నేర్పాయి. పట్టుదల ఉంటే జీవితంలో అనుకున్నది సాధించగలమన్న మాట అక్షరసత్యం మరి!

**– కాశీ వేంకటేశ్వరరావు,**
**తెలుగుపండిట్, ఏలూరు**



4